# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూన్ 16, 2017**

**దేశంలో పెంపొందుతున్న రైతాంగ ఆందోళనల వెల్లువను ఎత్తిపట్టండి !**

**తమ న్యాయమైన కోర్కెల కోసం పోరాడుతున్న దేశ రైతాంగానికి సంపూర్ణ మద్దతునివ్వండి !**

**సాగుతున్న రైతాంగ ఉద్యమంతో సమస్త ప్రజా ఉద్యమాలను దృఢంగా ఐక్యం చేయండి !**

**సాయుధ వ్యవసాయ విప్లవం మాత్రమే రగులుతున్న రైతాంగపు సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించగలదు !**

**నక్సల్బరీ పంథానే భారత రైతాంగ విముక్తికి ఏకైక మార్గం !**

**'దున్నేవారికే భూమి', 'సమస్త అధికారమూ ప్రజలకే'నని ధైర్యంగా ఎలుగెత్తి నినదించండి !**

దేశ చరిత్రను సంపూర్ణంగా మార్చివేసిన బెంగాల్ రాష్ట్ర డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ రైతాంగ సాయుధ వ్యవసాయ విప్లవ తిరుగుబాటు యాభయ్యవ వార్షికోత్సవం జరుపుకుంటున్న తరుణంలో, తమ తీవ్రమైన సమస్యల పరిష్కారం కోసం రైతాంగం మరోసారి ఉద్యమిస్తున్నారు. జూన్ 1వ తేదీ మహారాష్ట్రలో ప్రారంభమైన రైతాంగ పోరాటం గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో కొన్ని ప్రాంతాలకు వ్యాపించింది. మధ్యప్రదేశ్‌లో పోలీసులు విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో ఆరుగురు రైతాంగ ప్రదర్శనకారులు మరణించారు. ఈ రైతాంగ ఉద్యమ వెల్లువతో ముసురుకుంటున్న తుఫానును చెల్లాచెదురు చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కర్ఫ్యూ, నిషేధాజ్ఞలు, మూకుమ్మడి అరెస్టులు, బాష్ప వాయు ప్రయోగం, కొట్టడం, తప్పుడు కేసులలో ఇరికించడం, ఇంటర్నెట్ సేవలను మూసివేయడం మొదలయిన అణచివేత చర్యలను విస్తృతంగా అమలు చేస్తున్నాయి. ఇంతకు ముందు తమిళనాడు, పంజాబ్ మొదలయిన రాష్ట్రాల రైతాంగం చేసిన ఆందోళనలు చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందమయ్యాయి. నిరంకుశ అణచివేతతోను, కొన్ని మోసపూరిత చర్యలు ప్రకటించి, ఈ రైతాంగ గొంతును నులిమి వేయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. అయితే దేశ రైతాంగ ప్రజానీకపు రగులుతున్న సమస్యలను పరిష్కరించడంలో ఇవి విఫలమయి తీరతాయి. మధ్యప్రదేశ్ పోలీసులు మాంద్‌సౌర్ జిల్లాలో జూన్ 6వ తేదీన ఆరుగురు రైతులను చంపివేయడాన్ని, రైతాంగ ప్రదర్శనకారుల మీద ఇతర రూపాలలో ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేయడాన్నీ మా పార్టీ కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇందుకు పాల్పడ్డ నేరస్థ పోలీసులను, పౌర అధికారులనూ సంఘ పరివార్ ముఠాలనూ శిక్షించాలని డిమాండ్ చేస్తున్నది. దేశంలో వివిధ ప్రాంతాలలో రైతాంగం చేస్తున్న న్యాయమైన పోరాటానికి మా పార్టీ హృదయపూర్వక మద్దతు తెలియజేస్తున్నది. ఆలస్యం చేయకుండా ప్రభుత్వాలు వారి కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నది. ప్రత్యక్షంగా పాలు పంచుకోవడం ద్వారా గానీ సంఘీభావం ప్రకటించడం ద్వారా గానీ ఈ ఉద్యమాన్ని పటిష్టం చేయాలని మా పార్టీ అన్ని వర్గాల, సెక్షన్‌ల ప్రజలకు పిలుపునిస్తున్నది.

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలే కాకుండా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, తమిళనాడు మొదలయిన రాష్ట్రాల రైతాంగం కూడా విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నది తెలియనిది కాదు. రైతాంగంతో అత్యధికంగా ఉన్న భూమిలేని, పేద రైతాంగం భూమి కోసం పరితపిస్తున్నారు. వీరు అర్ధ భూస్వామ్య దోపిడీ పీడనల తీవ్ర బరువును తమ మూపుల పై మోస్తున్నారు. దీనికి తోడుగా, ఏ పార్టీ అధికారంలోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామ్రాజ్యవాద అనుకూల విధానాల బిగుస్తున్న ఉచ్చు వీరి జీవితాలను మరింతగా దిగజారుస్తున్నది. పేద రైతాంగమే కాకుండా, మధ్య, ధనిక రైతాంగం కూడా బడా బహుళజాతి కార్పొరేషన్‌ల, సామ్రాజ్యవాద ప్రపంచ మార్కెట్‌తో సన్నిహితంగా ముడిపడి ఉన్న వారి దేశీయ కుమ్మక్కుదారుల అదుపులో ఉన్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడడానికి, నిలదొక్కుకోవడానికి, మనుగడ కొనసాగించడానికీ ఇబ్బందుల పాలవుతున్నారు. వీరిలో అత్యధికులు కనీసానికి తమ వినిమయాన్ని పరిమితం చేసుకుంటున్నారు. పూర్తిగా నాశనం కాకుండా ఉండేందుకు సంఘర్షిస్తున్నారు.

అయితే సామ్రాజ్యవాదం, దాని దేశీయ ఏజెంట్ల ప్రయోజనాలను తీర్చడానికి భారత రైతాంగ ప్రజలను దోపిడీ పీడనలకు గురి చేయడం కొత్త విషయం కాదు. దేశాన్ని వలసగా చేసుకున్న నాటి నుంచే రైతాంగం తమ ఆర్థిక వినాశపు భీకరమైన అనుభవాన్ని చవి చూస్తున్నారు. బికారులై, ఆకలి, కరువు, మరణాలకు గురి అవుతున్నారు. రెండు శతాబ్దాలకు పైగా వలసవాదపు, దాని స్థానిక ఏజెంట్లు–బడా భూస్వాములు, దళారీ బడా పెట్టుబడిదారుల బరువును తమ భుజాల పై మోశారు. ఈ బానిస బంధనాలను తెంచుకోవడానికి వాళ్లు తుపాకులు, సంప్రదాయ ఆయుధాలతో వరుస రైతాంగ తిరుగుబాట్లు కూడా చేశారు. 1857 నాటి స్వాతంత్ర్య సంగ్రామంలో వీరే ప్రధాన శక్తిగా ఉన్నారు. అయితే ప్రతి సారీ వీరిని అత్యంత క్రూరంగా అణచివేశారు. ఒక మెరుగైన జీవితం గురించిన ఆకాంక్షతో వారు వలస వ్యతిరేక ఉద్యమంలో సమరశీలంగా పోరాడారు. అయితే

కాంగ్రెస్ నాయకత్వం వారికి ద్రోహం చేసింది. వాళ్లు తెలంగాణా సాయుధ పోరాటంలో పోరాడారు, పునప్రా-వాయలార్‌లో, తెభాగా ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ వారికి మళ్లీ, ఈసారి సంస్కరణవాద సీపీఐ నాయకత్వం ద్రోహం చేసింది. నామమాత్రపు 'స్వాతంత్ర్యం' కానీ ఆ తరువాత పాలక వర్గాల నామమాత్రపు భూసంస్కరణలు కానీ వ్యవసాయ విధానాలు కానీ విశాల రైతాంగ ప్రజల అవసరాలను తీర్చలేకపోయాయి. నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ దగ్గర నుంచి ప్రస్తుత మోదీ ప్రభుత్వం వరకు కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన పార్లమెంటరీ పార్టీలన్నీ రైతాంగానికి ఎన్నో హామీలిచ్చాయి. కానీ ప్రభుత్వాధికారం చేజిక్కిన తరువాత వారికి ద్రోహం చేశాయి. వినోబా భావే, జైప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా వంటి వారి నాయకత్వంలో సంస్కరణవాద సామాజికోద్యమాలు రైతాంగానికి పరిష్కారం చూపించడంలో ఘోరంగా విఫలమయారు.

అందుకని, యాభై సంవత్సరాల క్రితం నక్సల్బరీకి దారి తీసిన రైతాంగ పరిస్థితి మౌలికంగా అలాగే ఉన్నది. నిజానికి భారత ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, సమాజం మీద సామ్రాజ్యవాద పట్టు పెరగడంతో మరింత దిగజారింది. ముఖ్యంగా 1990ల ప్రారంభంలో, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థల షరతులకు లొంగిపోయిన భారత పాలకులు అపరిమిత సామ్రాజ్యవాద దోపిడీకి సమస్త ఆర్థిక రంగాల తలుపులు బార్లా తెరవడంతో భారత రైతాంగంలో అత్యధికులను పట్టి పీడిస్తున్న సంక్షోభం మరిన్ని రెట్లు పెరిగింది. ఎర్ర విప్లవానికి ప్రతిగా తీసుకువచ్చిన హరిత విప్లవ ప్రతికూల ప్రభావాలు కూడా అప్పటికి వ్యవసాయం సాపేక్షికంగా మరింత అభివృద్ధి చెందిన ప్రాంతాలలో కూడా కనిపించసాగాయి. ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల విధానాల వల్ల ఒక పక్క భూమి లేని తనం, మరో పక్క పేద, మధ్య, ధనిక రైతుల ఆర్థిక సంక్షోభంతో 1990లలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో వాణిజ్య పంటలు పండించే ప్రాంతాలలో రైతుల ఆత్మహత్యలు పెద్ద ఎత్తున జరిగాయి. ఇవి కొనసాగడం మాత్రమే కాకుండా గడచిన రెండు దశాబ్దాలలో దేశం నలుమూలలకూ వ్యాపించి, వ్యవసాయ సంక్షోభ తీవ్రతను తెలియజేస్తున్నాయి.

విత్తనాలు, ఎరువుల వంటివి అమ్ముతూ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూన్న దేశ, విదేశీ బడా కార్పొరేషన్‌లకు గ్రామీణ మార్కెట్ మీద పెరుగుతున్న గుత్తాధిపత్య నియంత్రణతో బడా భూస్వామ్య భూయజమానులకు, బడా కార్పొరేషన్‌లకు, రాజ్యానికీ వ్యవసాయ భూమి మీద ఉన్న గుత్తాధిపత్య అదుపు, వడ్డీవ్యాపారుల, షావుకార్ల ఉచ్చును తీవ్రతరం చేసింది. దీనికి వ్యతిరేకంగా దేశంలో వివిధ ప్రాంతాలలో, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్‌తో మరింత సన్నిహితంగా ముడిపడి ఉన్న చోట అక్కడక్కడా రైతాంగ ఆందోళనలు, ఉద్యమాలూ జరిగాయి. దీనికి తోడుగా గడచిన రెండు దశాబ్దాలలో ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు వ్యవసాయ, అటవీ భూమిని బలవంతంగా గుంజుకునే ప్రయత్నాలకు వ్యతిరేకంగా రైతాంగం చేసిన పోరాటాలతో భూమి సమస్యతో గట్టిగా ముడిపడి ఉన్న విస్థాపనకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరమయ్యాయి. గుజరాత్‌లో నర్మదా లోయ రైతాంగం నుంచి ఒడిశాలో కళింగనగర్, నియమగిరి వరకు, బెంగాల్‌లో సింగూర్, నందిగ్రామ్, లాల్‌గఢ్ నుంచి మహారాష్ట్రలో సూర్జాగఢ్ వరకూ తమ జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార్‌లను పరిరక్షించుకోవడం కోసం దేశమంతటా రైతాంగం 'ప్రాణాలైనా ఇస్తాం, భూమిని ఇవ్వం' అన్న నినాదంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిలిటెంటుగా పోరాటం చేయడంతో ప్రభుత్వం అనేక రైతాంగ వ్యతిరేక పారిశ్రామిక, ప్రాథమిక సౌకర్యాల ప్రాజెక్టులను వెనక్కు తీసుకుంది. జార్ఖండ్‌లో సీఎన్‌టీఏ, ఎస్‌పీటీఏ ఇచ్చిన హక్కులను పరిరక్షించుకోవడం కోసం పోరాటం చేస్తే, పెసా, ఐదవ, ఆరవ షెడ్యూల్స్ వంటి రాజ్యాంగ హక్కుల అమలు కోసం మహారాష్ట్ర వంటి కొన్ని రాష్ట్రాలు పోరాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్-తెలంగాణాలలో రైతాంగం పోలవరం డ్యాం వంటి వినాశకర ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే, కేరళలో పశ్చిమ కనుమల ప్రాంత ప్రజలు 'బయోస్ఫియర్ రిజర్వ్' వంటి వాటి పేరుతో జరుగుతున్న విస్థాపనను వ్యతిరేకిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలలో అధిక ఎంఎస్‌పీ కోసం, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం పోరాడుతున్నారు. ఈ రకంగా దేశవ్యాప్త రైతాంగ ఉద్యమానికి పరిస్థితులు పరిపక్వం అవుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయం మాదిరిగా తమకు కూడా బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలో జూన్ 1వ తేదీ నుంచి రైతాంగం ప్రారంభించిన అనిశ్చిత కాల సమ్మెతో నేటి పోరాటాల వెల్లువ ప్రారంభమయింది. తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, వడ్డీ లేని రుణాలు, నీరు, విద్యుత్తు, ఎరువుల వంటివి ఉచితంగా గానీ రాయితీలతో కానీ అందించడం, స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల (గత పార్లమెంటరీ ఎన్నికలకు ముందు మోదీ ఇందుకు హామీ ఇచ్చాడు. కానీ అతని ప్రభుత్వం ఇటీవల అడ్డం తిరిగి సుప్రీం కోర్టులో ఆ సిఫార్సులను అమలు చేయలేమని అఫిడవిట్ దాఖలు చేసింది) అమలు వంటి దీర్ఘకాల అపరిష్కృత డిమాండ్‌లను కూడా వారు లేవనెత్తుతున్నారు. ఉద్యమం ప్రారంభించినప్పటి నాటి నుంచి మహారాష్ట్ర రైతాంగం తమ ఉత్పత్తులను అమ్మ నిరాకరించారు, కొనుగోలు కేంద్రాలను, వ్యవసాయ మార్కెట్‌లను మూసివేశారు, రోడ్లను అడ్డగించారు, నిరసనతో పాలు, కూరగాయల వంటి ఉత్పత్తులను పారబోశారు. మిలిటెంటు ప్రదర్శనలు చేశారు. ఆ రాష్ట్రంలోను, దేశంలోనూ కూడా చాలా కాలం తరువాత రైతాంగం ఈ రకంగా సమ్మె చేశారు. భాజపా నేతృత్వంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చల తరువాత సమ్మె విరమించుకోవడానికి ఉద్యమ నాయకత్వంలో ఒక సెక్షన్ అంగీకరించింది కానీ మరో సెక్షన్ ఆందోళన కొనసాగించింది. త్వరలోనే గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్రలలో కూడా ఇటువంటి డిమాండ్లతో ఉద్యమం వేగంగా వ్యాపించింది. మోదీ ప్రభుత్వం కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ఇచ్చిన హామీలు, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాదిరిగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టి మొసలి కన్నీళ్లు కార్చడం వంటి వారి రాజకీయ నాటకాలు ఆందోళనకారులను సంపూర్ణంగా సంతృప్తిపరచడంలో విఫలమయ్యాయి. రైతాంగ అశాంతికి మౌలిక కారణాలు పరిష్కారం అయ్యేంత వరకూ పాతికేళ్ల క్రితం దేశంలో సరళీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ విధానాలు ప్రవేశపెట్టినప్పటి నుంచి అతి పెద్దది, విస్తృత ప్రాంతాలకు వ్యాపించిన ప్రస్తుత ఉద్యమం పూర్తిగా ఆగిపోదు.

నక్సల్బరీకి ఉన్నట్టుగా నేడు కొనసాగుతున్న రైతాంగ ఉద్యమానికి అటువంటి కార్యక్రమాన్ని పరిపూర్తి చేసుకోవడానికి కార్మికవర్గ నాయకత్వం, ఒక ఏకీకృత నిర్మాణం, ఒక విప్లవ కార్యక్రమం, లేదా తగిన వ్యూహం ఎత్తుగడలూ లేవన్నది నిజమే. కనుక ఈ ఉద్యమం అనివార్యంగా ఎక్కడికక్కడే,

విడివిడిగా ఉండిపోతుంది. పాక్షిక, లేదా ఆర్థిక డిమాండ్లకు పరిమితం అవుతుంది. ప్రస్తుత నాయకత్వం తీసుకువచ్చిన పోరాట రూపాలకు ఈ ఉద్యమం పరిమితమవుతుంది. ఏమైనప్పటికీ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న దేశంలో మూడింట రెండు వంతుల ప్రజలను ప్రభావితం చేస్తున్న నేటి తీవ్ర వ్యవసాయ సంక్షోభ పరిస్థితులలో ఇప్పుడు జరుగుతున్న రైతాంగ ఉద్యమానికి అపారమైన రాజకీయ ప్రాముఖ్యత ఉన్నది. దేశ భవిష్యత్తు గురించి ఆలోచించే, సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం నుంచి దేశాన్ని విముక్తి చేయాలని ఆకాంక్షించే వాళ్లెవరూ గ్రామీణ భారతంలో రగులుతున్న ఈ విశాల రైతాంగ ప్రజల ఉద్యమాన్ని గురించి ఆలోచించకుండా ఉండలేరు. తమ ఘోషను వినిపించడం కోసం వాళ్లు పోరాటం చేస్తున్నారు. తూటాలతోనో కొద్ది పాటి విదిలింపులతోనో వారి గొంతులను నొక్కి వేయగలమని పాలకులు భావిస్తే పొరపాటు.

సరైన నాయకత్వం, సరైన వ్యూహం ఉంటే, తమ ప్రయోజనాలకు హానికరంగా ఉన్న ఏ పాలక శక్తినైనా గానీ సవాలు చేసి, అధికారం నుంచి దింపివేయగల శక్తి వ్యవసాయ దేశ రైతాంగానికి ఉన్నదని చరిత్ర పదే పదే నిరూపించింది. వారి జీవిత అనుభవం, శాంతియుత ఆందోళనల వైఫల్యంతో ప్రస్తుత వ్యవస్థలో తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లేదని రైతాంగం అర్థం చేసుకుంటున్నారు. జాతీయ, ప్రజాస్వామిక విప్లవ పరిపూర్తి కోసం నక్సల్బరీ వేసిన సాయుధ వ్యవసాయ విప్లవ పోరాట మార్గంలో మాత్రమే దేశ రైతాంగం సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అనే మూడు పర్వతాలను కూలదోసి వారి మౌలిక సమస్యలను పరిష్కరించుకోగలరు. తమ తక్షణ ఆర్థిక డిమాండ్ల కోసం పోరాడుతూనే కార్మిక-కర్షక మైత్రి, నాలుగు పీడిత వర్గాల (కార్మికులు, రైతాంగం, పట్టణ మధ్య, పెటీ బూర్జువా వర్గం) ఐక్యత పునాదిగా రైతాంగ ఉద్యమాన్ని జరుగుతున్న దీర్ఘకాలిక ప్రజా యుద్ధంతో సమైక్యం చేసేందుకు కృషి చేయాలి.

అలాగే రైతాంగ ఉద్యమం సమస్త పీడిత వర్గాల, సామాజిక సెక్షన్ల - కార్మికులు, మధ్య తరగతులు, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, స్వయం ఉపాధితో బతికేవారు, నిరుద్యోగులు, దళితులు, ఆదివాసులు మతపర అల్పసంఖ్యాక వర్గాలు, పీడిత జాతులు, మహిళలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, కళాకారాలు, న్యాయవాదులు, పాత్రికేయులు, ఇతర సమస్త కార్మిక ప్రజానీకపు ఉద్యమాలతో ఐక్యం కావడం నేటి అవసరం. దేశ పాలకులకు, వారి ప్రమాదకరమైన రాజకీయ ప్రతినిధి, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భాజపా ప్రభుత్వానికీ వ్యతిరేకంగా విజయవంతమైన పోరాటం చేయడానికి, ఈ ఐక్యత అవసరం. మా పార్టీ కేంద్ర కమిటీ మరోసారి ఆందోళనా పథంలో ఉన్న రైతాంగానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది, వారి కోర్కెలన్నింటినీ నెరవేర్చాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, ఆలస్యం లేకుండా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది. రైతాంగ ఉద్యమాన్ని బలంగా సమర్థించమని, మోదీ నేతృత్వంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమస్త పీడిత ప్రజల దేశవ్యాప్త ఐక్య పోరాట పెను తుఫాను సృష్టించమనీ దేశ విప్లవ, ప్రజాస్వామిక శక్తులకు పిలుపునిస్తున్నాం.



**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**